# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-11-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు సమావేశం కానుంది.**

**2. పోలవరం ప్రాజెక్టును 2028 మార్చి నాటికి పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

**3. తెలంగాణలో నిర్వహించనున్న కులగణన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ అన్నారు.**

**4. ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే సంక్రాంతిలోపు రహదారి మరమ్మతుల పనులను పూర్తి చేస్తామని రాష్ట్ర చేనేత జౌళి శాఖా మంత్రి ఎస్.సవిత తెలిపారు.**

**5. తెలంగాణలో పత్తి సేకరణకు 105 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.**

============================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు సమావేశం కానుంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో భూసేకరణ చట్టం, నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్, కొత్త క్రీడా విధానం, డ్రోన్, సెమీకండక్టర్, డేటా సెంటర్ పాలసీల రూపకల్పన, క్రీడాకారులకు ప్రోత్సాహక నగదు పెంపుపై చర్చిస్తారని అధికారులు తెలిపారు.

-------------------------

పోలవరం ప్రాజెక్టును 2028 మార్చి నాటికి పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పోలవరం పనులు కొత్త డయాఫ్రం వాల్ డిజైన్లు, నిర్మాణ ప్రణాళిక, డిజైన్లకు అనుమతి వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, డయాఫ్రం వాల్, ప్రధాన డ్యాం సమాంతరంగా నిర్మించేందుకు ఉన్న అవకాశాలపైనా చర్చించి నిర్ణయం తీసుకోవాలని అన్నారు. అలాగే సెమీకండక్టర్లు, డ్రోన్ రంగాలపై కూడా ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. సెమీకండక్టర్లు, డ్రోన్ రంగాల్లో పెట్టుబడుల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక విధానాలను తీసుకురానుందని తెలిపారు.

---------------------------

తెలంగాణలో నిర్వహించనున్న కులగణన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ అన్నారు. హైదరాబాద్‌లో పర్యటిస్తున్న ఆయన నిన్న బోయిన్‌పల్లి గాంధీ తత్వ చింతన కేంద్రంలో కులగణనపై నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ, కులగణనలో ఏ ప్రశ్నలు అడగాలనేది సామాన్యులే నిర్ణయించాలని చెప్పారు. గణన ద్వారా ఎస్సీ, ఎస్టీలు, ఓబీసీలు, మహిళల సంఖ్యపై స్పష్టత వస్తుందని ఆయన తెలుపుతూ

వాయిస్ ....27 సెకన్లు

అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, 2025లో కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనగణనలో కులగణన కార్యక్రమంలో సంబంధించి ప్రత్యేకంగా ఒక కాలమ్ కేటాయించాల్సిందిగా కోరుతూ రాష్ట్ర మంత్రివర్గంలో తీర్మానించామని చెప్పారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా, కులగణనను వంద శాతం పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి వివరించారు.

కాగా తెలంగాణా వ్యాప్తంగా ఈరోజు నుండి ఈనెల 8 వరకు కులగణన కార్యక్రమం ప్రారంభంకానుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే సంక్రాంతిలోపు రహదారి మరమ్మతుల పనులను పూర్తి చేస్తామని రాష్ట్ర చేనేత జౌళి శాఖా మంత్రి ఎస్.సవిత తెలిపారు. కడప కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో జిల్లా స్థాయి కమిటీ సమీక్షా సమావేశాన్ని మంత్రి నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,

వాయిస్ ... 25 సెకన్లు

---------------------------

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఈ నెల 25 నుంచి వచ్చే నెల 20వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఉభయ సభల సంయుక్త సమావేశాల ఏర్పాటు ప్రతిపాదనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారని. డిసెంబర్ 20 వరకు శీతాకాల సమావేశాలు జరుగుతాయని ఆయన తెలిపారు. అలాగే ఈ నెల 26 రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్ల సందర్భంగా వార్షికోత్సవ ప్రత్యేక కార్యక్రమం జరగనుందని పేర్కొన్నారు.

మరోవైపు ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసన మండలి సమావేశాల నిర్వహణ తేదీలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 11న ఉదయం 10 గంటలకు సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ ను జారీ చేశారు.

---------------------------

తెలంగాణలో పత్తి సేకరణకు 105 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్రావు తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో పత్తి కొనుగోళ్లు అంశపై మార్కెటింగ్ శాఖ అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకువచ్చే రైతులు వాటి తేమ శాతం 8 నుంచి 12 మధ్య ఉండేలా చూసుకోవాలన్నారు. రైతులు తమ దగ్గరలోని కోనుగోలు కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలని సూచించారు. కొనుగోళ్లలో ఏమైనా ఇబ్బందులు ఉంటే రైతులు 8897281111 నెంబర్ ద్వారా సంప్రదించాలని మంత్రి కోరారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమిష్టి సహకారంతో సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమీక్షా సమావేశంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ మాట్లాడుతూ,

వాయిస్...27 సెకన్లు

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని జిల్లా ఇన్చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

వాయిస్ .... 30 సెకన్లు

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు నమోదుకు ఈరోజుతో గడువు ముగియనుందని ఎన్‌టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీ నరసింహం తెలిపారు. ఇప్పటివరకు నమోదు చేసుకోని పట్టభద్రులు ఓటు హక్కు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఓటు ఉన్నవారు కూడా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు మళ్లీ కొత్తగా నమోదు చేసుకోవాలని సూచించారు.

-------------------------

తెలంగాణ వ్యాప్తంగా 2025 జనవరి నుంచి రేషన్ కార్డు దారులందరికీ సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి ధాన్యం సేకరణ అంశంపై రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, ఎమ్మెల్సీలతో దృశ్యమాధ్యమం ద్వారా సంభాషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్న ధాన్యంపై క్వింటాల్‌కు 500 రూపాయల అదనపు నగదును అందిస్తున్నామని చెప్పారు. ధాన్యం సేకరణను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు క్షేత్ర పర్యటనలు నిర్వహించాలని మంత్రి సూచించారు.

-------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈరోజు వాతావరణం పొడిగా ఉంటుందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఈరోజు, రేపు గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశముందని తెలిపింది. అలాగే కొన్ని జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

=====================